క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: నారాయుడుపాలెంలో గురువారం రాత్రి మరిడిమాంబ అమ్మ వారి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ కోరుకొండ వెంకటి రాజు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, ఇల్లా నాగేశ్వరరావు, భీశెట్టి ధనశ్రీను, రాపేటి పరమేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



మాట్లాడుతున్న సీఐ లక్ష్మణరావు

రాంబిల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని సీఐ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం రాత్రి ఆయన కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు. గొడవల జోలికి పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ తప్పకుండా పాటించాలన్నారు. అందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వృద్ధురాలికి సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం/రాంబిల్లి: పూడిమడక స్వామి వివేకానంద వికలాంగుల చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహకారంతో వృద్ధురాలికి వాకర్‌తో పాటు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. రాంబిల్లి మండలం వాడనర్సాపురానికి చెందిన దొలి పిల్లి కొండమ్మ మెట్ల మీద నుంచి జారిపడడంతో కాలు విరిగింది. దీంతో ఆమెకు ఆర్థిక సాయంతో పాటు, నడిచేందుకు వీలుగా వాకర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మేరుగు నూకరాజు,జి. రాము,సూరాడ ప్రభాకర్,గాడి రాము,ఎస్. చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంబశివుని ఆలయ వార్షికోత్సవం



సాంబశివ ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక సాంబశివుని ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు చర్యలు తీసుకున్నారు. పెద్దలు అలంక ప్రకాశరావు, కుంది సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫై.. డే

కశింకోట: వేసవి తాపం పెరిగింది. మండల ప్రజలు సూర్యతాపంతో శుక్రవారం ఉక్కిరిబిక్కిరయ్యారు. స్వల్పంగా వడ గాడ్పులు కూడా వీచాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించలేకపోయారు. అత్యవసర పనులు ఉన్న వారు మినహా మిగిలిన వారు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని వీధులు, రోడ్లు జన సంచారం లేక వెలవెలబోయాయి.

తుది దశకు పింఛన్ల పంపిణీ

మునగపాక: మండలంలో పింఛన్ల పంపిణీ తుది దశకు చేరుకుంది. దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి శుక్రవారం పింఛన్ అందజేశారు. మునగపాక మండల వ్యాప్తంగా 8,616 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, ఇంతవరకు 7,899 మందికి పింఛన్ నగదు అందజేసినట్టు ఎంపీడీవో ఎం.మన్మధరావు తెలిపారు. 717మందికి శనివారం సాయంత్రం లోగా పింఛన్లు బట్వాడా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కోటవురట్ల: ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టడంతో మండలంలోని సచివాలయాల సిబ్బంది హుటాహుటిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కదలలేనివారి, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు. కోటవురట్ల మండలంలో 9,685 మంది లబ్ధిదారులుండగా, 7,645 మందికి నగదు పంపిణీ పూర్తి చేశారు. గురువారం సాయంత్రం నాటికి మండలంలో 78.88 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. ఇంకా పలు గ్రామాల్లో దివ్యాంగులకు పింఛను అందలేదు. మళ్లీ వలంటీర్లు ఇంటింటికీ వచ్చి పింఛన్లు పంపిణీ చేయాలని, ఇదంతా జరగాలంటే రాజన్న బిడ్డ జగనే మళ్లీ సీఎం కావాలని అవ్వాతాతలు కోరుకుంటున్నారు.

తొలి సంతకం ప్రకటనపై హర్షం

మరో వైపు ప్రతిపక్ష కుట్రలకు నిరసనగా వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు. రాజీనామాలు చేసిన వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయిన వెంటనే వలంటీర్లపై తొలి సంతకం చేస్తాననడం మా గౌరవం పెరిగిందన్నారు.

వలంటీర్ల వ్యవస్థపై జగనన్నకు ఎనలేని నమ్మకం ఉందని, అందుకు ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, జగనన్న సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత మళ్లీ మా సేవలు కొనసాగిస్తామని వారు చెప్పారు.

తొలి సంతకం.. సంతోషం



వలంటీరుగా ఇన్నాళ్లు నేను చేసిన సేవలకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రతిపక్షం వలంటీర్ల వ్యవస్థపై విషం కక్కినా ఓర్చుకున్నాను. సీఎం జగనన్న ఆశయాలను నెరవేర్చడంలో నేనూ భాగస్వామినైనందుకు గర్విస్తున్నాను. ఎప్పుడైతే ప్రతిపక్ష నేత చంద్రబాబు కక్ష కట్టి సేవకు అడ్డుపడ్డారో అప్పుడే ఈ పరిస్థితి వస్తుందని అర్థమైంది, మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తేనే సేవ చేసుకునే అవకాశం కలుగుతుంది. అందుకే రాజీనామా చేశాను. మళ్లీ వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చేందుకు జగనన్న తొలిసంతకం చేస్తామనడం ఎంతో గర్వంగా, సంతోషంగా ఉంది.

– తమరాన నూకరత్నం, పూర్వ వలంటీరు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

వలంటీర్ వ్యవస్థపై జగనన్నకు సంపూర్ణ నమ్మకం



గత ఐదేళ్లుగా జగనన్న ప్రభుత్వంలో వలంటీరుగా పనిచేసి సేవ చేశాను. డబ్బుకు ఆశించకుండా జగనన్న ఆశయాన్ని నిజాయితీగా నెరవేర్చాను. ప్రతిపక్షం కుట్రతో సేవకు దూరం కావడం బాధ కలిగించింది. అయితే జగనన్న మొదటి సంతకం వలంటీరు వ్యవస్థపైనే అని ప్రకటించడం ఎంతో గర్వంగా ఉంది. ఎందుకంటే ఏ సీఎం అయినా ముందుగా అత్యుత్తమ కార్యక్రమానికే తొలిసంతకం చేస్తారు. వలంటీరు వ్యవస్థపై జగనన్న పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనం. ఈ ఎన్నికలలో జగనన్న ప్రభుత్వం రావడానికి కష్టపడతాను. మళ్లీ వలంటీరుగా సేవ చేసుకునే భాగ్యాన్ని జగనన్నే ఇస్తారు.

– గొల్లు రామలక్ష్మి, పూర్వ వలంటీరు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

పింఛను డబ్బుల కోసం ఎదురు చూపు..



నా పేరు దుర్గా ప్రసాద్, మాది రామన్నపాలెం. దివ్యాంగుడిని. జగనన్న దయతో వలంటీరు ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. వలంటీర్ రాకుండా చంద్రబాబు అడ్డుకున్నాడు. అందుకే ఇంకా డబ్బులు అందలేదు. నేనేమో సచివాలయానికి ఎళ్లలేను. మానాన్న కూలి పని మానుకుని నన్ను తీసుకెళ్లాలి. తీరా ఎళ్లాక సచివాలయంలో అధికారులు ఉంటారో ఉండరో తెలీదు. చానా ఇబ్బంది పడాలి . ఇలాంటి కట్టాలు మళ్లీ రాకూడదు. అందుకే మా అమ్మా నాన్నకు చెప్పా మళ్లీ జగనన్నకే ఓటు ఎయ్యాలని, జగనన్నే సీఎం కావాలి. అప్పుడు మాలాంటోళ్లకు కట్టం ఉండదు. ఈ ఐదేళ్లు కట్టం తెలీకుండా బతికాం. ఆ కట్టం ఏంటో చంద్రబాబు సూపించాడు. అలాంటోళ్లను రానీయకూడదు. అందరూ కాస్త ఆలోచించి ఓటేయండి.

– బొట్టా దుర్గాప్రసాద్, దివ్యాంగుడు, రామన్నపాలెం.

సైనికుల్లా పనిచేయాలి



అడ్డురోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బొడ్డేడ ప్రసాద్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన ఎస్.రాయవరం మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులకు ఓటమి భయం వెంటాడుతోందని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదా కుమారి, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మడల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, రామరాజు, మధురాజు, వియ్యపు వరహాలరావు, వియ్యపు చినరమణ, గుర్రం నానాజీ, చోడిపలి కోదండ, అద్దేపల్లి నూకునాయుడు, బొజ్జన్న, దారబోయిన రాము, చొప్పారాజు, వెలగా శ్రీను, మణిరాజు, సర్పంచ్‌లు కొప్పిశెట్టి సత్యం, గాడి అప్పలనరసింహ, కనికళ్ల అమ్మాజీ, గుమ్మడి నారాయణరావు తదితరులుపాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ ఖాయం

ఎస్.రాయవరం: అంతా కలసికట్టుగా పనిచేస్తే పాయకరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పాయకరావుపేట నియోజకవర్గానికి కొత్తగా వచ్చినప్పటికీ ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఆదరణ చూపుతున్నారన్నారు. తాను కూడా అడ్డురోడ్డులోనే నివాసం ఉంటూ గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. పింఛన్ల విషయంలో అవ్వాతాతలను అవస్థలకు గురిచేసిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్ ,రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ , వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న,పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు,వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రం నానాజీ, ఐ.వి.రత్నం,చోడిపల్లి గోవిందు,రమణ,చొప్పా రాజు,మధువర్మ, గొర్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



అడ్డురోడ్డులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మునగపాక ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలపక్షతిగా సేవలందిస్తున్నారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలన్నారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాల నాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు, పెంటకోట వెంకట్,ఎంఎం నాయుడు ఆడారి సంతోష్‌కుమార్, జగ్గు,జగన్నాథరావు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల: కైలాసపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. సబ్ స్టేషన్‌లో అదనంగా 5ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని అందువల్ల ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. యండపల్లి, బి.కె.పల్లి, కె.తంగేడు, రాజుపేట, రామన్నపాలెం, రామచంద్రపురం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తున్న కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చయ్యపేటకు చెందిన టి.వెంకటగణేష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ డి.రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పూడిమడక రహదారి పూల్‌భాగ్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెంకటగణేష్ పది మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

సెక్టోరియల్ అధికారులది కీలక పాత్ర

ఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి సెక్టోరియల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని యలమంచిలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ అన్నారు. నియోజకవర్గంలోని సెక్టోరియల్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సన్నద్ధ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నియోజకవర్గంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు అధికారులంతా కృషి చేయాలని సూచించారు. ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియకు సంబంధించి పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో యలమంచిలి తహసీల్దార్ అప్పలరాజు,ఏఆర్వోలు,ఎంసీసీ బృందాలు,ఎన్నికల సెల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



సెక్టోరియల్ అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మనోరమ

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక



ఎమ్మెల్యే కంబాల జోగులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో పార్టీలో చేసిన టీడీపీ నాయకులు

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు, గుర్రాజుపేటల్లోని టీడీపీ, జనసేనకు చెందిన 30 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అడ్డురోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ జూన్ 4న మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీకి చెందిన కోరా జగదీష్, యరమాటి మురళీకృష్ణ, రమాటి సూర్యారావు, కోరాసూర్యప్రకాష్, కోరా వెంకన్న, అంగా నారాయణరావు, జనసేనకు చెందిన కలగా సాయికుమార్, దాడిశెట్టి ప్రభ, జయదమ్ము నరేష్, కూరపాటి వెంకటరమణ, పిల్లి ప్రసాద్, కోన దుర్గారావు, కొరపాటి దుర్గ, గుర్రాజుపేట నుంచి వైబోయిన సింహాచలం, గొంప నాగరాజు, కొమ్ము శ్రీను, కొర్ని రమణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోరా జగదీష్, కోరెడ్డి సుబ్బారావు, కొంగర రాజు, చేకూరి అశోక్‌రాజు, ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజు, మాజీ సర్పంచ్ మధువర్మ తదితరులు పాల్గొన్నారు.



బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన గుర్రాజుపేట నాయకులు

బడుగుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

నక్కపల్లి: అణగారిన ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం నక్కపల్లి మండలంలో వాడ వాడలా ఘనంగా జరిగాయి. నక్కపల్లిలోని ఎస్సీ కాలనీ వద్ద ఉన్న బాబూజీ విగ్రహానికి నియోజక వర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా బడుగుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. అట్టడుగు వర్గాల నుంచి ఉపప్రధాని పదవి చేపట్టి ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. నెల్లిపూడి, సీతంపాలెం, కాగిత, డీఎల్‌పురం, చినరామభద్రపురం, చినదొడ్డిగల్లు, దేవవరం, వేంపాడు తదితర గ్రామాల్లో కూడా బాబూజీకి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైఎస్సార్‌మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి వైస్ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి,సురేష్‌వర్మ,సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, పిఏసిఎస్‌అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, బీసీసెల్ అధ్యక్షుడు గొర్ల బాబూరావు,సఖిరెడ్డి రమణ, వెంకటరావు,సూరిబాబు, వై అప్పారావు తదితరులుపాల్గొన్నారు.

యలమంచిలి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని యలమంచిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అప్పలరాజుతో కలసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల కోసం అహర్నిశలు పోరాడిన గొప్ప నాయకుడని తెలిపారు.

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. రాట్నాలపాలెంలో సర్పంచ్ అనిల్‌కుమార్, జైభారత్ జయహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, కృష్ణ, రాంబాబు, పెదదేముడు, బిట్టు, చిన్నారులు పాల్గొన్నారు.



రాట్నాలపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సర్పంచ్ అనిల్‌కుమార్



నక్కపల్లిలో నివాళులర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్, కంబాల జోగులు తదితరులు

ఐదుగురు గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేస్తున్న గ్రామ వలంటీర్లు

పాయకరావుపేట: మండలంలోని మాసాహేబుపేట గ్రామానికి చెందిన ఐదుగురు గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా శుక్రవారం రాజీనామా చేశారు. వీరు విడివిడిగా రాజీనామా పత్రాలను ఎంపీడీవో కె.స్వప్నకు మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌తో టీడీపీ నాయకుడు మాపై ఫిర్యాదు చేయించడంతో మా విధులకు ఆటంకం ఏర్పడిందని, సేవల చేయలేని ఉద్యోగాలు ఎందుకని రాజీనామా చేశామని చెప్పారు. ఎన్నికల కమిషన్ తమను పింఛన్ల పంపిణీకి దూరం చేయడం బాధ కలిగించిందని చెప్పారు. ఎన్నికల తరువాత మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం గ్రామ వలంటీర్ల ఫైల్ చేస్తానని జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

నూకాలమ్మా.. నమోస్తుతే

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం శోభాయమానంగా ప్రారంభమయింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు, శూలాలతో అమ్మవారి మాలధారులైన భక్తుల మధ్య నూకాంబిక ఉత్సవ విగ్రహ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. – అనకాపల్లి



రథంపై పలు వేషధారణలలో చిన్నారులు



శూలాలతో నూకాంబిక మాలధారణ భక్తులు

ముమ్మరంగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట: పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. 20 వార్డుల్లోను, 27 బూత్ ఏరియాల్లోను ఆయా బూత్ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, దళిత నాయకులు నెలపర్తి అర్జున్, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, కొప్పిశెట్టి మోహన్ తదితరులు పాల్గొంటున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోటవురట్ల: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.